క్లుప్తంగా

ఆస్తి ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: స్థలంలో అక్రమంగా ప్రవేశించి ఆస్తి ధ్వంసం చేసిన వ్యక్తి పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి ప్రాంతానికి చెందిన పోలవరపు కిరణ్‌కుమార్‌కు పెదపులిపాక గ్రామంలో స్థలం ఉంది. అయితే అతని బంధువు పోలవరపు సురేష్ స్థలంలో అక్రమంగా ప్రవేశించి ఆస్తి ధ్వంసం చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఎన్జీవో యూనిట్ క్యాలెండరు ఆవిష్కరణ



కంకిపాడు: ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ఏపీ ఎన్జీఓ కంకిపాడు యూనిట్ నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉద్యోగులు నిలుస్తున్నారని తెలిపారు. సంక్షేమం క్షేత్రస్థాయికి చేరుకోవాలంటే అది ఉద్యోగులు వల్లే సాధ్యమన్నారు. సమష్టిగా, సమన్వయంగా పనిచేస్తే ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. తొలుత ఎంపీపీ రాజ్యలక్ష్మిని యూనిట్ ప్రతినిధులు సత్కరించారు. డీఎల్‌పీఓ దుర్గాప్రసాద్, మండల పరిషత్ ఏఓ ఉదయ్‌భాస్కర్, యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమరాజు, ప్రతినిధులు మిక్కిలినేని శ్రీనివాసరావు, శివరామకృష్ణ, ఏడుకొండలు, మునిరాజు, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

గన్నవరం: మండల పరిషత్ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయానికి కేసరపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు గోగినేని ప్రసాదరావు రూ.30 వేలు విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. గ్రంథాలయంలో ఆదివారం దాత ఇచ్చిన కంప్యూటర్‌ను ప్రారంభించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు మాట్లాడుతూ..తన విజ్ఞప్తి మేరకు స్నేహితుడైన ప్రసాదరావు కంప్యూటర్ అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు చిమట రామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, గ్రంథాలయాధికారి కె.నాగరాజు, రికార్డ్ అసిస్టెంట్లు బాబురావు, కె.జ్యోతికుమారి, రామచంద్రరాజుపాల్గొన్నారు.

క్యాలెండర్లు పంపిణీ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు క్యాలెండర్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు ఆదివారం ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయంలో పార్వతీదేవి, రామలింగేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆవిష్కరించి భక్తులకు పంపిణీ చేశారు. నైమిశారణ్య పీఠాధిపతి హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాలబ్రహ్మానంద సరస్వతి ఉదయం భక్తులను ఉద్దేశించి శివలీల విలాషతత్వం ప్రవచనం చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు గూడూరు రామలింగేశ్వర విద్యాసాగర్ పలువురు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు అందజేత

ఉంగుటూరు: విద్యార్థి దశ నుంచే సేవాగుణం కలిగి ఉండటం అభినందనీయమని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీహరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు నూతన సంవత్సరం సందర్భంగా రోడ్డు పక్కన ఉండే నిరు పేదలకు దుప్పట్లు, పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. తేలప్రోలు, ఉయ్యూరు, రామవరప్పాడు, బెంజిసర్కిల్, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో రొడ్డు పక్కనే ఉన్న నిరు పేదలు సుమారు 300 మంది దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు.

ఆనందోత్సాహాల్లో పింఛన్ లబ్ధిదారులు



గొడవర్రులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛను లబ్ధిదారులు, రైతులు

పెనమలూరు: పెంచిన పింఛను నగదు అందుకున్న లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు పింఛను పెంపుదల చేశారని తెలిపారు. కొత్తగా పెంచిన నగదుతో రూ.2750 పింఛను నగదు తెల్లవారుజామునే వలంటీర్లు తమ ఇళ్లకు వచ్చి అందించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా మండల పరిధిలో 528 మందికి పింఛన్లు మంజూరు చేసింది. అందులో పెనమలూరు మండంలో 162 మంది, తాడిగడప మున్సిపాలిటీలో 366 మంది ఉన్నారు. వీరికి ఆదివారం పింఛన్ సొమ్ము అందచేశారు. మండల పరిధిలో మొత్తం 17,934 మందికి పింఛన్‌లు ఉండగా వారికి ప్రభుత్వం రూ.4.99 కోట్లు నిధులు మంజూరు చేసింది. మొత్తం 30 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉదయాన్నే పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. సాయంత్రానికి దాదాపు 85 శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. మిగతా పింఛన్లు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. గంగూరు వన్ సచివాలయ పరిధిలో అనారోగ్యంతో మంచం పట్టిన కంచర్ల సామ్రాజ్యంకు సచివాలయ సిబ్బంది రాజేష్, వలంటీర్ శాంతి శోభరాణి పింఛన్ సొమ్ము అందించారు.

ఉయ్యూరు: కొత్త ఏడాది మొదటి రోజే ప్రభుత్వం పెంచిన పింఛన్ల సొమ్మును న్యూ జోష్‌తో వలంటీర్లు ఆదివారం వేకువజాము నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఉయ్యూరు పట్టణంలోని 20 వార్డుల్లో పెంచిన పింఛను సొమ్మును అవ్వాతాతలు, ఇతర లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పంపిన సందేశ కరపత్రంతో పాటు పింఛను సొమ్ము రూ.2750, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అందించారు. ఈ పంపిణీ ప్రక్రియను కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ విమాదేవి పర్యవేక్షించారు. పెంచిన పింఛను సొమ్ము అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలంలో 80 శాతం లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేయించామని ఎంపీడీఓ బి.భార్గవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి పెంచిన రూ.250 కలిపి లబ్ధిదారునికి రూ.2,750 చొప్పున పెన్షన్ అందచేశామన్నారు. మండలంలో మొత్తం 16 వేల 733 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో 13,381 మందికి రూ.3,72,15,300 పెన్షన్‌ను వలంటీర్లు పంపిణీ చేశారని తెలిపారు.



నున్నలో పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్



ఉంగుటూరులో పింఛను పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీవో



గంగూరు సచివాలయం వన్ పరిధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కంకిపాడు: అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పలువురు వక్తలు తెలిపారు. పింఛను సొమ్ము పెంపుదల, కొత్త పింఛన్లు మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం సొమ్ము జమ కావటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పింఛనుదారులు, రైతులు గొడవర్రు సచివాలయం వద్ద సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వక్తలు మాట్లాడుతూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వరుసగా మూడో ఏడాది కూడా పింఛను సొమ్మును ప్రభుత్వం పెంచిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంఛనుగా పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ రైతులకు అండగా సీఎం జగన్ నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ చెన్ను బాబ్జీ, పీఏసీఎస్ చైర్మన్ కాగిత శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాగిత రాజా రమేష్, వక్కలగడ్డ రాము, ఉప్పులేటి రవి, మాదు రామారావు తదితరులు పాల్గొన్నారు.

172 మందికి నూతన పింఛన్లు మంజూరు...

ఉంగుటూరు: మండలంలో 172 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు. వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేస్తామని వివరించారు. మండలంలోని ఉంగుటూరు, ఆముదాలపల్లి, ఇందుపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు.

మండల వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల్లో 8042 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ఆదివారం 7870 మందికి రూ.2750 వంతున వలంటీర్లు పంపిణీ చేశారని తెలిపారు. ఎంపీడీవోతోపాటు ఈవోపీఆర్‌డీ బాషా, పీఆర్ ఏఈ బాబూరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పెనమలూరులో కొత్త పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సర్పంచ్ భాస్కరరావు

- పింఛన్ పెంచి హామీ నెరవేర్చిన జగనన్న
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న ఇచ్చిన హామీ మేరకు నూతన సంవత్సరంలో పింఛన్ సొమ్ము పెంచారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన ఆదివారం వేకువజామున పెనమలూరు పల్లిపేటలో కొత్త పింఛన్‌లతో పాటు పాత పింఛన్‌ల సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో 65 లక్షల మంది పేదలకు ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. గత టీడీపీ పాలనతో పోల్చితే తమ ప్రభుత్వ పాలనలో పింఛన్లు రెట్టింపు అయ్యాయన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము 2500 నుంచి రూ.2750 కు పెంచిందన్నారు. అదనంగా రూ.250 పింఛన్ పెంచారని తెలిపారు. పేదలకు సేవ చేయటమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు.

ప్రతిపక్షాలవి అసత్య ప్రచారం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్‌లు రద్దు చేస్తుందని ప్రతిపక్ష టీడీపీతో పాటు పలు పార్టీలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేశాయని ఎమ్మెల్యే పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల భారం ప్రభుత్వం తగ్గిస్తుందని అలజడి సృష్టించారన్నారు. ప్రభుత్వ పరిపాలనలో భాగంగానే ప్రతి ఆరు నెలలకు ఒక సారి పింఛన్‌ల వెరిఫికేషన్ ఉంటుందని, అందులో భాగంగానే నోటీసులు ఇచ్చారన్నారు. ఈ రోజువరకు ఎవ్వరికీ పింఛన్ రద్దు చేయలేదన్నారు. లబ్ధిదారులు నూతన సంవత్సరంలో ఆనందంగా పింఛన్ తీసుకున్నారని తెలిపారు. లబ్ధిదారులు ఆనందంగా ఉంటే ప్రతిపక్షాల మొఖం మాడిపోతుందని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయటం ప్రభుత్వం అదృష్టంగా భావిస్తుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పార్థసారథి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ కిలారు వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సునితాశర్మ, ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, నేతలు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, అక్బర్‌బాషా, ఎండి.అహ్మద్, జాఫర్‌ఖాన్, మాదు శ్రీనివాసరావు, కంచర్ల సుధీర్, శ్రీధర్, తెన్నేటి ప్రకాష్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా నిలుస్తాం

ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: ఉపాధ్యాయులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. ఎస్టీయు నూతన సంవత్సర క్యాలెండరును ఆయన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బదిలీల సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు, అధ్యక్షుడు ఎంవీ శ్రీనివాస్, పివి కృష్ణమోహన్, ఏ.శ్రీనివాసమూర్తి, పి.సురేష్‌బాబు, ఏ.సత్యవంతు, విజయ్‌కుమార్, ఐ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎస్టీయు క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

చిల్డ్రన్ హోమ్‌కు ఫర్నిచర్ వితరణ

గన్నవరం: స్థానిక అమ్మ చిల్డ్రన్ హోమ్‌కు ప్రముఖ న్యాయవాది కేవీ.రమణ భోజనశాల సామాగ్రిని వితరణ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఐదు స్టీల్ టేబుల్స్, 30 కుర్చీలను ఆయన హోమ్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ..హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథలైన వృద్ధులు, పిల్లల భోజన సౌకర్యార్థం వీటిని అందజేసినట్లు తెలిపారు. జెడ్పీ బాలుర హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ నిడమర్తి రామారావు, హోమ్ నిర్వాహకురాలు కానూరి శేషుమాధవి తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతుల సంక్షేమానికి తోడ్పాటు

గన్నవరం: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణామిల్క్ యూనియన్ అన్ని రకాల తోడ్పాటు అందిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక విజయ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే, యూనియన్ డైరెక్టర్ డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ..రైతులకు మేలు చేసే విధంగా మూడేళ్ల క్రితం రూ.56 ఉన్న పాల సేకరణ ధరను దశల వారిగా రూ.78కు పెంచామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ చరిత్రలోనే పాల సేకరణ ధరను తక్కువ వ్యవధిలో రూ.22 పెంచడం ఇదే ప్రథమమని తెలిపారు. సంస్థ టర్నోవర్ కూడా రెట్టింపు స్థాయిలో పెరిగిందన్నారు. ఇదంతా పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. యూనియన్ డైరెక్టర్లు పాలడుగు నాని, పలగాని కొండలరావు, టి.స్వర్ణకుమారి, ట్రస్ట్ సభ్యులు జే.కోటిరెడ్డి, పునుకొల్లు రత్నప్రసాద్, ఫీడ్ కమిటీ సభ్యులు కర్ర శివప్రసాద్, తుమ్మల రామారావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న చలసాని, దాసరి, పాలడుగు

కళ్లెదుటే పేదల కలల సౌధం

- కృష్ణా జిల్లాలో ఊపందుకున్న ఇళ్ల నిర్మాణం
- జగనన్న లే అవుట్‌లలో చురుగ్గా వసతుల కల్పన
- చాలా చోట్ల తుది దశకు పనులు
- డ్వాక్రా సంఘ సభ్యులకు వ్యక్తిగత రుణాలు

కంకిపాడు(పెనమలూరు): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగం పెరిగింది. పేదలు తమకు కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణాలను చేపట్టి, వేగంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో పడ్డ అవస్థలు తీరటంతో సంబరపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల సొంతింటి కల సాకారం దిశగా పాలన సాగిస్తున్నారని కొనియాడుతున్నారు. అవసరమైన నిధులు కేటాయింపులు జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని వివరిస్తున్నారు.

ఇళ్ల పనులు పరుగులు..

ప్రభుత్వ మార్గదర్శకాలతో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద కృష్ణా జిల్లా వ్యాప్తంగా 262 జగనన్న లే అవుట్‌లలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయింపు జరిగింది. వీటిలో 93,245 గృహాలు మంజూరయ్యాయి. ఇందుకుగానూ రూ. 277.20 కోట్లు నిధులు కేటాయింపులు జరిగాయి. ఆయా లే అవుట్‌లలో ఇప్పటికే 7,776 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. ఆ కాలనీల్లో తమ సొంతింటిలో నివాసం ఉంటున్నారు. 22,813 గృహాలు పునాదులు, శ్లాబులు దశలో ఉన్నాయి. దశల వారీగా ఇళ్ల నిర్మాణాల బిల్లులు లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండటంతో నిర్మాణ పనులను త్వరితగతిన సాగిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు..

ఒక్కో ఇంటికి ఇచ్చే రూ. 1.80 లక్షలకు తోడు డీఆర్‌డీఏ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు ఇంటి నిర్మాణానికి రూ. 35 వేలు రుణం బ్యాంకుల నుంచి అందేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 30,281 మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ. 35 వేలు చొప్పున ఇప్పటికే రూ. 105.98 కోట్లు అందాయి. ఈ రుణంతో లబ్ధిదారులు బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేయకుండా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు.



వణుకూరులోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

మౌలిక వసతుల కల్పన లోనూ..

జిల్లా వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి 262 జగనన్న లే అవుట్‌లను ఏర్పాటు చేశారు. ఆయా లే అవుట్‌లలో విద్యుత్ లైన్లు, రహదారులు, కరెంటు మీటర్లు, తాగునీటి వసతుల కల్పన వంటి సుమారు 449 పనులకు రూ 66.75 కోట్లు మంజూరు చేసింది. ఆయా లేఅవుట్‌లలో ఇప్పటికే 221 పనులు ప్రారంభం అయ్యాయి. వీటికి గానూ రూ 1.40 కోట్లు వెచ్చించారు. విద్యుత్ లైన్లు, రహదారుల కల్పన, తాగునీటి వసతులు మెరుగుపర్చటంతో లే అవుట్‌లు కాలనీలను తలపిస్తూ సుందరంగా రూపొందుతున్నాయి.

తుది దశలో పట్టణ గృహాలు..

పట్టణ నివాస, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీ టిడ్కో) ద్వారా పట్టణ పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు తుది దశకు చేరుకున్నాయి. పీఎంఏవై-వైఎస్సార్ జగనన్న నగర్‌లలో ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం రూ 1.50లక్షలు రాయితీ ఇస్తోంది. జిల్లా పరిధిలో గృహ వసతి లేని పేదలకు 13,712 గృహాలను నిర్మించి అందించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు టిడ్కో ఇళ్లు నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన లక్ష్యాలకు అనుగుణంగా సాగుతోంది.

సొంతింటి కల నెరవేరింది..



ఉప్పలూరులో 13 ఏళ్లుగా ఉంటున్నాం. గతంలో ఎన్నో సార్లు ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టినా ప్రయోజనం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్జీ పెట్టాను. స్థలం మంజూరైంది. జగనన్న లే అవుట్‌లో ఇల్లు కట్టుకుని, గృహ ప్రవేశం కూడా చేశాను.

– పోసిన శివనాగమల్లేశ్వరి, ఉప్పలూరు, కంకిపాడు మండలం

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ప్రభుత్వ ప్రాధాన్యతాంశం. ప్రత్యేక అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి శనివారం హౌసింగ్ డే ద్వారా ఇళ్ల నిర్మాణ ప్రగతి సందర్శన, లబ్ధిదారుల్లో చైతన్యం నింపేలా ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయి కార్యాచరణ జరుగుతుంది. మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– రంజిత్ బాషా, కలెక్టర్, కృష్ణాజిల్లా

సంబరంగా కొత్త ఏడాది వేడుకలు

కంకిపాడు: కొత్త సంవత్సరం వేడుకలు అంతటా ఉత్సాహంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక యువత గ్రామాల్లో కేరింతలు కొడుతూ టపాసులు పేల్చి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముంగిట అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని ఆయన కార్యాలయంలో కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య శ్రేణులు ఉన్నారు.

గన్నవరం: స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత న్యూఇయర్ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేయడంతో పాటు నూతన సంవత్సర క్యాలెంటర్లను ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరికి మంచి జరగాలని వంశీమోహన్ ఆకాంక్షించారు.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ బాలస్వామి

పెనమలూరు: కానూరు కార్మెల్ చర్చిలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేశారు. గంగూరు, పోరంకి, గోసాల, కానూరు, కామయ్యతోపు నుంచి భక్తులు పెద్ద ఎత్తున కార్మెల్ చర్చికి తరలివచ్చారు. ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేశారు. దివ్యప్రసాద ఆరాధన ఫాదర్ రాయప్ప నిర్వహించారు. నూతన సంవత్సర దివ్యబలి పూజలు ఫాదర్ జయరాజ్ సమర్పించి ప్రసంగించారు.

విజయవాడ రూరల్: మండల పరిషత్ పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలో రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన గ్రాంటు, కేంద్ర ప్రభుత్వ నిధులతో కలిపి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరావు, ఎంపీడీఓ బి.భార్గవి, గ్రామ పంచాయతి కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు: న్యూ ఇయర్ వేడుకలు వాడవాడలా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. ఉయ్యూరు ఎస్సీ కాలనీలో చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రీస్తును ఆరాధించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఎమ్మెల్యే పార్థసారథిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులు నూతన సంవత్సరం పురస్కరించుకుని కేకును కట్ చేసి ఆనందం పంచుకున్నారు. లైబ్రేరియన్ కె.కృపానందం పాల్గొన్నారు. తెంపల్లి సచివాలయం వద్ద జరిగిన వేడుకల్లో సర్పంచ్ కొలుసు శిరీషా, పంచాయతీ కార్యదర్శి నామేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతన సంవత్సరంలో ప్రజలందరికి మరింత మేలు జరగాలని, ప్రజారంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని వైఎస్సార్ సీపీ సినీయర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ సినీయర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు నివాసానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు. హనుమాన్‌నగర్ కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను డాక్టర్ దుట్టా ఆవిష్కరించారు.